


స్కానర్ల పనితీరు పరిశీలన

మంగళగిరి: నగరంలో చెత్త సేకరణ తీరును పరిశీలించేందుకు ఏర్పాటుచేసిన ఆర్‌టీఎంఎస్ (రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్)లను కమిషనర్ ఆలీంబాషా బుధవారం పరిశీలించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7226 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 3240 క్యూసెక్కులు వదిలారు.



సూరేపల్లిలో పడి పూజ

భట్టిప్రోలు(సూరేపల్లి): భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో కొలువైన కేదారేశ్వర వాయులింగ దేవస్థానంలో బుధవారం పడి పూజ నిర్వహించారు. వాయులింగానికి సాష్టాంగ నమస్కారాలు చేశారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



తాడికొండ: తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరిలతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

సబ్ జైలులో 'మీకు తెలుసా'

గురజాల: స్థానిక సబ్ జైల్‌నందు రీడ్స్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంపై బుధవారం అవగాహన నిర్వహించారు. పీసీ కె రవికుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది..ఎటువంటి జాగ్రత్తలు చేపట్టాలి అనే విషయాల గురించి ఖైదీలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్/హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడరాదని కలిసి జీవించాలన్నారు. క్షయ వ్యాధి, సుఖ వ్యాధుల గురించి తెలియచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకయ్య, ఎల్‌టీ కృష్ణ, రీడ్స్ ఏఎస్ఎం యలమందమ్మ, పీతఃలు, జైలర్ సీహెచ్ వివిఎన్ సుబ్బారెడ్డి తదితరులున్నారు.

చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరిస్తాం



నగరంపాలెం: ప్రజా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి న్యాయం చేస్తామని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో బుధవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారాల వ్యవస్థను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల్లో నిర్వర్తించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పోలీస్ అధికారులు విధిగా హాజరుకావాలని అన్నారు. ప్రజా సమస్యలను ఆలకించి, చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కరించేందుకు నిరంతరం పోలీసులు అందుబాటులో ఉంటారని అన్నారు.

శిశు విక్రయ కేసులో ముగ్గురి అరెస్ట్

నరసరావుపేటటౌన్: శిశు విక్రయ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు నరసరావుపేట టూటౌన్ సీఐ హైమారావు బుధవారం తెలిపారు. పట్టణంలో అక్రమంగా శిశు విక్రయాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి శౌరిరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిమ్మతోటకు చెందిన పోకులూరి అనిల్ తన శిశువును విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన పాటి శ్రీనివాసరావుకు విక్రయించినట్లు తెలుసుకున్నారు. వారిద్దరితోపాటు మధ్యవర్తిగా వ్యవహరించిన మహిళను అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

నాగార్జునకొండను సందర్శించిన శ్రీలంక దేశీయులు



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను బుధవారం శ్రీలంక దేశానికి చెందిన 50 మంది బృందం సందర్శించింది. వీరు స్థానిక లాంచీస్టేషన్ నుంచి శాంతిసిరి లాంచీలో నాగార్జునకొండకు చేరుకున్నారు. కొండలోని మ్యూజియంలో ఉన్న తొమ్మిది అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని పుట్టుకకు సంబంధించిన శిలా ఫలకాలు, రాతి పనిముట్లు, సింహళ విహార్‌లోని మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం తిలకించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి పర్యాటకశాఖ ఉద్యోగులు వారికి వివరించారు. అనంతరం అనుపు, యాంపీ స్టేడియం, ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు.

గొంతు నొక్కేస్తున్నారు

- కనీస సమాచారం ఇవ్వకుండా అరెస్టులు
- ఏ స్టేషన్‌కి తరలిస్తున్నారో తెలియక ఆందోళన
- వచ్చినవారు అసలు పోలీసులేనా అనుమానాలు
- పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న కుటుంబ సభ్యులు



రాష్ట్రంలో ఆటవిక రాజ్యం రాజ్యమేలుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారి గొంతులు నొక్కేస్తున్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులను అక్రమంగా అరెస్టులు చేసి వేధిస్తున్నారు. పోలీసులు మఫ్టీలో అర్ధరాత్రి ఇళ్లకు వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అరెస్టు అయిన వారు ఎక్కడ ఉన్నారో తెలియక కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో సోషల్ మీడియా యాక్టివిస్టుల అక్రమ అరెస్ట్‌లు

భావప్రకటన స్వేచ్ఛకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీసులు

సాక్షి, నరసరావుపేట: టీడీపీ నేతల ప్రోద్బలంతో ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా నిర్బంధిస్తున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరింపజేస్తోంది. ఎప్పుడెప్పుడి పోస్టులో బయటకు తీసి తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు ఒత్తిళ్లకు తలొగ్గి అర్ధరాత్రి పూట మఫ్టీలో వెళ్లి సోషల్‌మీడియా కార్యకర్తలను తీసుకెళ్తున్నారు. వచ్చిన వాళ్లు పోలీసులేనా, కాదా అనేది కూడా కుటుంబసభ్యులకు తెలియడం లేదు. దీంతో తమ బిడ్డలను టీడీపీ రౌడీ మూకలు, పోలీసులలో ఎవరు తీసుకెళ్లారో తెలియక ఆందోళన చెందుతున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆరా తీస్తున్నారు. పోలీసులు తమకు తెలియదని, ఏ స్టేషన్ వారు వచ్చారో సమాచారం లేదని తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

పక్కజిల్లాలో కేసులు నమోదు

జిల్లాలోని ముప్పాళ్ల మండలం దమ్మాలపాడుకు చెందిన కల్లా నాగిరెడ్డిపై ప్రకాశం జిల్లా మార్కాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం తాడేపల్లిలో అయ్యప్పస్వామి గుడికి వెళుతుండగా మాలలో ఉన్న నాగిరెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ వివరాలు తెలియక రోజంతా నాగిరెడ్డి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇలా పక్క జిల్లాలలో కేసులు నమోదుచేసి ఇబ్బందికి గురిచేస్తున్నారు. మరికొందర్ని రోజూ స్టేషన్‌కు పిలిపించి ఉదయం నుంచి సాయంత్రం దాకా కూర్చొబెడుతున్నారు. ఎందుకు పిలిపిస్తున్నారో, ఏ కేసు నమోదుచేశారో చెప్పడం లేదు. స్థానిక టీడీపీ నేతలను బతిమాలి ఒప్పిస్తే కేసులు లేకుండా ఇంటికి పంపుతామని పోలీసులే చెబుతుండటం గమనార్హం. నాలుగు రోజుల వ్యవధిలో జిల్లాకు చెందిన ఐదుగురు సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్టు తెలుస్తుండగా, పదుల సంఖ్యలో కేసులు నమోదుచేసినప్పటికీ అరెస్ట్ చేసే వరకు గోప్యంగా ఉంచినట్టు తెలుస్తోంది.

ఎప్పుడు వదులుతారో చెప్పడం లేదు...



మా అన్న కొడుకు పప్పుల వెంకటరామిరెడ్డి సోషల్ మీడియాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అసభ్యకరమైన పోస్టులు పెట్టారని గురజాల పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం హైదరాబాదు నుంచి తీసుకువచ్చారు. అప్పటి నుంచి స్టేషన్ బయటే ఉదయం నుంచి రాత్రి వరకు కాచుకొని ఉన్నాం. ఎప్పుడు వదులుతారో తెలియడం లేదు.

–చలమారెడ్డి, తేలుకుట్ల గ్రామం, గురజాల మండలం

అక్రమ కేసులు బనాయించారు...



మా అబ్బాయి షేక్ మాబు పిడుగురాళ్ల రూరల్ మండలం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్నాడు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పోస్టులు పెడుతున్నారన్న నెపంతో అక్రమ కేసులు బనాయించారు. సోషల్ మీడియా కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి.

–షేక్ బడే సాహెబ్, సర్పంచ్, బ్రాహ్మణపల్లి, పిడుగురాళ్ల మండలం

సాయంత్రం దాకా కూర్చోబెడుతున్నారు...



వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పోస్టులు పెట్టానన్న నెపంతో దీపావళి ముందు వరుసగా నాలుగు రోజులు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఉదయం నుంచి రాత్రి వరకు పోలీస్‌స్టేషన్‌లోనే కూర్చొబెట్టారు. కేసు ఏంటి, ఎందుకు కూర్చొబెడుతున్నారో చెప్పలేదు. ఇప్పుడు మళ్లీ స్టేషన్‌కు రమ్మని కబురు పంపుతున్నారు. కక్షపూరితంగా నన్ను ఇబ్బందిపెడుతున్నారు. నా మాదిరిగానే పోస్టులు పెడుతున్న పలువురిని ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి.

–పిల్లి సాగర్‌బాబు, సోషల్ మీడియా కన్వీనర్, నాదెండ్ల మండలం

అపరాల సాగు రైతులకు అవగాహన



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం గొడవర్రులో అపరాలు సాగు చేస్తున్న రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ అధికారి ఎం.అనూరాధ, జిల్లా వ్యవసాయ కార్యాలయ అధికారి ఎస్.శ్రీవాణి విచ్చేసి అపరాలు సాగుచేయడంలో సమస్యలను వివరించారు. అపరాలు విస్తీర్ణం పెంచడంపై రైతులకు అవగాహన కల్పించారు. అపరాలు సాగుచేయడం వలన భూసారం పెరుగుతుందని, రైతులు అవసరం మేరకే పురుగు మందులు వాడాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష, ఏఈవో రమేష్, వీఏఏ పవన్, రైతులు, ఎంపీటీసీ శివకుమార్ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికపై ముగిసిన శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై జిల్లా, మండల స్థాయి అధికారులకు జెడ్పీ సమావేశ మందిరంలో రెండు రోజులపాటు నిర్వహించిన మొదటి విడత శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈసందర్భంగా పల్నాడు జిల్లా పరిధిలోని 28 మండలాలకు చెందిన అధికారులకు, గ్రామ పంచాయతీల కార్యదర్శులకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు తొమ్మిది సూత్రాల ఆధారిత అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏపీ పంచాయతీ రాజ్–గ్రామీణాభివృద్ధి సంస్థ జేడీ ఆర్.కేశవరెడ్డి, పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కరరెడ్డి సమన్వయంతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ కె.మోహనరావు, ఏపీఎం జవన్, డీపీఎం డి.రవీంద్రబాబు, బి.దయాసాగర్, డీపీఆర్సీ జిల్లా సమన్వయకర్త ఎస్.పద్మరాణి, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు గుంటూరు, బాపట్ల జిల్లాలకు..

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై జెడ్పీ సమావేశ మందిరంలో గురు, శుక్రవారాల్లో గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులకు శిక్షణా కార్యక్రమాలు జరగనున్నాయి.

రీచ్‌లు మూత

- ఇసుక దొరకక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పెరుగుతున్న డిమాండ్
- పక్క మండలాలకు పరుగులు
- ఇసుక అక్రమ రవాణాకు అవకాశం
- ఉచిత ఇసుక లభ్యంపై అయోమయం

కృష్ణా నది పరివాహక ప్రాంతం అయినప్పటికీ అమరావతి మండల ప్రజలకు ఇసుక కష్టాలు తప్పడం లేదు. మండల పరిధిలో ఏడు ఇసుక రీచ్‌లు ఉన్నాయి. అన్ని రీచ్‌లను మూత వేశారు. దీంతో ఇసుక కోసం పక్క మండలాలకు పరుగులు పెడుతున్నారు. ఇది అక్రమార్కులకు వరంగా మారింది. మండల ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. ఉచిత ఇసుక అమలు అయోమయంగా తయారైంది.



వైకుంఠపురం ఇసుక రీచ్‌లో ట్రాక్టర్‌లకు ఇసుక లోడు చేస్తున్న దృశ్యం

అమరావతి: అమరావతి మండలంలో వైకుంఠపురం, అమరావతి, ధరణికోట, దిడుగు, మల్లాది, మునగోడు, పొందుగల గ్రామాలలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఒక్క రీచ్‌లో కూడా ఇసుక తవ్వకాలకు అధికారులకు అనుమతులు ఇవ్వలేదు. పక్క మండలాలకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాల్సి వస్తుంది. గతంలో రూ.1875 దొరికే ట్రాక్టర్ ఇసుక ప్రస్తుతం అమరావతిలో రూ.5వేల నుంచి రూ.6వేల వరకు పలుకుతుంది. దీంతో పాటు అక్రమ ఇసుక రవాణాదారులు కూడా ఇదే అదనుగా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ నుంచి ఇసుక అక్రమంగా తవ్వకాలు చేసి రవాణా చేస్తున్నారు. మరికొందరు గతంలోనే ఇసుకను నిల్వ చేసి ప్రస్తుత పరిస్థితులలో అధిక ధరకు ఇసుకను అమ్ముకుంటున్నట్లు సమాచారం. గత 45రోజులుగా ఇసుక రేవులు మూసివేయటంతో అక్రమంగా ఇసుక రవాణాకు అవకాశం ఇచ్చినట్టయింది. ఆధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించటంతో అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలు అక్రమ ఇసుక రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

ఉచిత ఇసుక లభ్యంపై అయోమయం

ప్రభుత్వం ప్రకటించి ఉచిత ఇసుక ఎలా పొందాలో అర్థంకాక ప్రజలలో అయోమయం నెలకొంది. తొలుత ట్రాక్టర్ తీసుకుని పోయి కూలీలతో ఎక్కడైనా లోడ్ చేసుకోవచ్చునని ప్రకటించారు. తర్వాత వాగులలో, చెరువులలో, చిన్న నదులలో మాత్రమే ఉచిత ఇసుక తెచ్చుకోవచ్చు. నదులలో ఇసుక తెచ్చుకోవటానికి అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పొందటానికి లోడింగ్, చార్జీలు, రవాణా చార్జీలు ఎక్కడ చెల్లించాలి, ఎవరికి చెల్లించాలి, చెల్లిస్తే ఆన్‌లైన్‌లోనా, లేక ఆఫ్‌లైన్‌లోనా అర్థంకాక, ఇసుక దొరకక పనులు భవన నిర్మాణ పనులు ఆపుకున్నా వారు ఇబ్బందులు పడుతున్నారు.

అడ్డదారులు తొక్కాల్సిందేనా..

అమరావతి మండలంలోని గ్రామాల వారికి ఇసుక కావాలంటే తుళ్లూరు మండలంలోని రీచ్‌లకు వెళ్లాల్సి వస్తుంది. సుమారు 20కిలోమీటర్లపైన ఇసుక రవాణా చేయటానికి ధర ఎక్కువ పెట్టి కొనాల్సి వస్తుంది. అంతదూరం నుంచి అధిక చార్జీలు పెట్టి తెచ్చుకోలేక, జరుగుతున్న పనిని అపలేక ఇసుక వినియోగదారులు అక్రమ రవాణా చేసే వారిని ఆశ్రయిస్తున్నారు. ఈదే అదనుగా మండలంలో పలు రీచ్‌ల నుంచి అక్రమ ఇసుక రవాణా చేసేవారు ఇష్టారాజ్యంగా ఇసుక విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అమరావతికి ఇసుక కావాలంటే రూ.5 నుంచి రూ.ఆరు వేలు చెల్లించాల్సిందే.

ఇసుకను అందుబాటులోకి తేవాలి

మండలంలోని మిగిలిన అమరావతి, వైకుంఠపురం, ధరణికోట, దిడుగు, మల్లాది, మునగోడు, పొందుగల ఇసుకరేవులు మూసి ఉండటంతో ఇసుక కోసం ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రజలకు అనుకూలమైన విధానం ద్వారా ఉచిత ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చి, రీచ్‌లలో ఉన్న చిన్నచిన్న సమస్యలను ప్రభుత్వ అధికారులు పరిష్కరించి ఇసుకను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా తరలుతున్న ఇసుక

క్రోసూరు: అచ్చంపేట చుట్టు పక్కల ఉన్న రీచ్‌ల నుంచి దూర ప్రాంతాలకు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. అక్రమార్కులు అధిక ధరలు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. అచ్చంపేట రీచ్‌ల నుంచి క్రోసూరు వరకు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరానికి ధర గిట్టుబాటు కావటం లేదంటూ దూరప్రాంతాలకు ట్రక్కు రూ.6000 వేల వరకు విక్రయిస్తున్నారు. బుధవారం క్రోసూరుకే రూ.4,200 విక్రయించారని భవన నిర్మాణదారుడు చెప్పారు. కొంత మంది ట్రాక్టర్లు ఉన్న వారు క్రోసూరుకు తీసుకురావాలంటే గిట్టుబాటు కాదని దూరప్రాంతాలైన సత్తెనపల్లి, పిడుగురాళ్లకు తీసుకెళ్తున్నామని చెబుతున్నారు. ట్రక్కుదారులు అనేక మంది కూడా దూరప్రాంతానికి ఇసుక తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ట్రాక్టర్లు ఉన్నవారు ఉచిత ఇసుక తీసుకోవచ్చునని ప్రకటించటంతో కొందరికి లాభసాటిగా మారింది. అదేమంటే రీచ్‌ల వద్ద ఇసుక లోడింగ్ ధర ట్రక్కుకు రూ.2వేల నుంచి రూ 2.5 వేలు తీసుకుంటున్నారని ట్రాక్టర్ల నిర్వాహకులు చెబుతున్నారు.



క్రోసూరు నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలుతున్న ఇసుక

ఒక్క రీచ్‌కైనా అనుమతి ఇవ్వాలి



మండలంలోని అన్ని రీచ్‌లను మూతవేశారు. గతంలో ఏ రీచ్ నుంచైనా రూ.2500 నుంచి రూ.మూడు వేల వరకు ఇసుక లభించేది. ప్రస్తుతం రూ.5 నుంచి రూ.6వేలకు కొనాల్సి వస్తుంది. మండలంలో ఎక్కడో ఒకచోట రీచ్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తే ప్రజలకు ఇసుక అందుబాటులోకి వచ్చి తక్కువ ఖర్చుతో ఇసుక లభించే అవకాశముంది.

– ఆలా లక్ష్మీనారాయణ, అమరావతి

ప్రజలపై అదనపు భారం



మండలంలోని ఇసుక రీచ్‌లన్నీ మూత వేయడం వల్ల ఇసుక అక్రమ రవాణా ఎక్కువైంది. ప్రజలపై అదనపు భారం పడుతుంది. వందలాది మంది కార్మికులు, కూలీలు పనులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రీచ్‌లను తెరిచి ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెచ్చి కార్మికులకు, కూలీలకు ఉపాధి కల్పించాలి.

– సయ్యద్ మొహీద్దీన్, సీపీఎం మండల కార్యదర్శి, అమరావతి

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే పవన్ ఆరోపణలు

- సరస్వతీ భూముల్లో అటవీ, అసైన్డ్ భూములు లేవని అధికారులే తేల్చారు
- ఒకసారి అటవీ చట్టం చూసి ఆరోపణలు చేస్తే బాగుండేది
- శాంతిభద్రలతోపాటు అన్ని రంగాల్లో విఫలం
- నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: రాష్ట్రంలో సూపర్ సిక్స్ అమలుతోపాటు శాంతిభద్రతలను ప్రజలకు అందించలేక అన్ని విధాలుగా విఫలమైన టీడీపీ కూటమి నాయకులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ కోసం డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సరస్వతి భూముల పరిశీలన చేశారని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీఎంగా ఉండగా రైతులకు అప్పుడున్న విలువ కంటే రెండుమూడు రెట్లు అధికంగా చెల్లించి సిమెంట్ ఫ్యాక్టరీ కోసం భూములు తీసుకోవటం జరిగిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం విచారణ చేసి ఈ భూముల్లో అసైన్డ్, అటవీ భూములు లేవని చెప్పారన్నారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ వచ్చి 400ఎకరాల అటవీ భూములను రెవెన్యూ భూములుగా మార్చారని చెప్పారని, వాస్తవానికి రెండున్నర హెక్టార్లకంటే ఎక్కువ అటవీ భూములు తీసుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని చట్టం చెబుతుందన్నారు. ఎంత భూమి తీసుకుంటే అంత భూమి మళ్లీ అటవీభూమిగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ వాస్తవం చట్టం చూస్తే అటవీశాఖను చూస్తున్న పవన్‌కు తెలుస్తుందన్నారు. గత నెలలో అక్కడున్న తహసీల్దార్ క్షమారాణి సరస్వతీ భూముల్లో ఎటువంటి అసైన్డ్, అటవీ భూములు లేవని స్పష్టం చేశారన్నారు. గత నెల 26న ఫారెస్టు బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు ఎటువంటి అటవీ భూములు లేవని, వీటికి సరస్వతీ భూములు ఏడుమీటర్ల దూరంలో ఉన్నాయని స్పష్టం చేశారన్నారు. వీరిద్దరూ ఈ ప్రభుత్వంలోని అధికారులే అన్నారు. అక్కడ అనేక సిమెంట్ ఫ్యాక్టరీల కోసం అనేక సంస్థలకు భూములు ఇచ్చారని చెప్పారు. మరి వారు ఫ్యాక్టరీలు ప్రారంభించలేదు అన్నారు. వారినేమి ప్రశ్నించకుండానే కేవలం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై కక్షసాధించేందుకే సరస్వతీ భూములపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అన్నీ రంగాల్లో విఫలమై ప్రజలను మభ్యపెట్టేందుకు మాజీ సీఎం జగన్‌పై కక్షతో సరస్వతీ భూముల అంశాన్ని బయటకు తీసుకొచ్చారని, వీరి పోకడలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, అవకాశం వచ్చిన సమయంలో తమ తడాఖా కూటమి నేతలకు చూపిస్తారని హెచ్చరించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నరసరావుపేట: పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, జీవో నెం.77 రద్దు చేయాలని, విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించా రు. సాయికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో ఉన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్లు విడుదల చేయలేదన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో నారదమునిని కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు అమూల్య, యాసిన్, ఫణీంద్ర, సిద్ధు పాల్గొన్నారు.

ఏఆర్ అదనపు ఎస్పీగా సత్తిరాజు బాధ్యతల స్వీకారం



నరసరావుపేట: జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా నియమితులైన వి.సత్తిరాజు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం ఎస్పీ కంచి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. సమర్థంగా విధులు నిర్వహిస్తూ ప్రజల రక్షణ, భద్రతకు కృషిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని ఎస్పీ సూచించారు.

మాచర్ల డివిజన్‌లో రూ.4.07 కోట్లతో పనులు


ఇంజినీర్లు, అధికారులతో సమీక్ష చేస్తున్న ఎస్‌ఈ కృష్ణమోహన్

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలోని మాచర్ల డివిజన్‌లో రూ.4.07 కోట్ల వ్యయంతో చేపట్టే 101 పనులు వచ్చే డిసెంబర్ నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. బుధవారం స్థానిక ఎన్‌ఎస్‌పీ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.కృష్ణమోహన్ చేపట్టబోయే పనులపై మాచర్ల డివిజన్ ఇంజినీర్లు, అధికారులతో సమీక్ష చేశారు. ప్రతిపాదించిన పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున పనులు ప్రారంభించి నాణ్యతతో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మంజూరైన పనులకు టెండర్లు పిలవటం జరిగిందని ఈనెలాఖరులోగా వాటిని ఖరారు చేయాలని సూచించారు. సమావేశంలో మాచర్ల డివిజన్ ఈఈ శ్రీహరి, డీఈ మురళీధర్, వెంకటరావు, జేఇఇలు పాల్గొన్నారు.

'నయాగరా' అధినేత పోలిశెట్టి కన్నుమూత



రేపల్లె రూరల్: నయాగరా ఫైల్స్ ఇండస్ట్రీస్ అధినేత పోలిశెట్టి నాగమల్లేశ్వరరావు (92) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని పట్టణంలోని స్వగృహానికి బుధవారం తీసుకొచ్చారు. నాగమల్లేశ్వరరావు 1964 నయాగరా ఫైల్స్ ఇండస్ట్రీస్‌ను చిన్న పరిశ్రమగా నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పించారు. లయన్స్ క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలకు ప్రభుత్వం ఇందిరా ప్రియదర్శిని పురస్కారాన్ని అందజేసింది. నాగమల్లేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయనకు పలువురు రాజకీయ ప్రముఖులు నివాళి అర్పించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చినగంజాం: స్థానిక యానాది కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ శీలం రమేష్ అందించిన సమాచారం ప్రకారం.. యానాదికాలనీకి చెందిన చోటూరి కోటేశ్వరమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో కోటేశ్వరమ్మ ఇంటిలో నిద్రిస్తుండగాగా.. ఆమె 19 ఏళ్ల కుమార్తె ఇంటి బయట నిద్రిస్తోంది. రాత్రి 11 గంటల ప్రాంతంలో కోటేశ్వరమ్మ ఇంటి బయటకు వచ్చి చూడగా కుమార్తె కన్పించలేదు. దాంతో బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు

8,9,10 తరగతుల వారి నుంచి దరఖాస్తుల ఆహ్వానం


విద్యార్థులను పోటీలకు సిద్ధం చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయుడు

బెల్లంకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించేందుకు భారతీయ విజ్ఞానమండలి (బీవీఎం), ఆంధ్ర ప్రదేశ్ సైన్స్ సిటీ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్- 2024 పోటీలు నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలతోపాటు పోస్టర్ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మూడు దశల్లో నిర్వహించే ఈ పోటీలకు నవంబర్ 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.బీబీఎంఏపీ.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. విద్యార్థులకు పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో పోటీలు నిర్వహించనున్నారు. పాఠశాల, జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో, రాష్ట్రస్థాయి పోటీలు ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్‌కు నవంబర్ 15 ఆఖరి తేదీ. పాఠశాల స్థాయి పరీక్షలు నవంబర్ 20,21,22 తేదీలలో ఉంటాయి. పాఠశాల స్థాయిలో జరిగిన పరీక్షలో మొదటి 20 స్థానాలు గెలుపొందినవారు జిల్లా స్థాయికి అర్హులు. జిల్లా స్థాయి పరీక్షలు డిసెంబర్ 6న, రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్ 29, 30 తేదీలలో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో నిర్వహిస్తారు. పోటీల్లో భాగంగా కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు, పోస్టర్ కాంపిటీషన్, వైజ్ఞానిక లఘు చిత్ర పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేయనున్నారు.

15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



మేధస్సు, సామర్థ్యాలను వెలికి తీయడానికి కౌశల్ పోటీలు చాలా ఉపయోగకరం. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతూ ఆసక్తిగల విద్యార్థుల వివరాలను పాఠశాల కోఆర్డినేటర్లు నెంబర్ 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉత్సాహం నింపాలి. పోటీలకు సంబంధించి వివరాలకు ఫోన్ నెంబర్ 8790290997ను సంప్రదించాలి.

– బి.శ్రీనివాసరావు, కౌశల్ జిల్లా కోఆర్డినేటర్

సారాబట్టీలపై ఎక్సైజ్ సిబ్బంది దాడులు


బెల్లం ఊటను ధ్వంసం చేసిన దృశ్యం

బాపట్ల టౌన్: సారాబట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఈ ఘటన మండలంలోని స్టువార్టుపురం గ్రామంలో చోటుచేసుకుంది. రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ పోరంబోకు స్థలంలో నాటుసారా తయారు చేసేందుకు ఉపయోగించే బెల్లం ఊట డ్రమ్ములను గుర్తించారు. 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడులు నిర్వహించిన వారిలో బాపట్ల ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐలు ప్రభుదాస్, మౌనిక, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ పి. రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు


బస్సు ఢీకొట్టడంతో కింద పడిన మహిళలు

తాడేపల్లిరూరల్: విజయవాడ నుంచి గుంటూరు వెళ్తున్న గుంటూరు–2 డిపో నాన్‌స్టాప్ బస్సు ఢీకొని విజయవాడ కృష్ణలంకకు చెందిన నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం రాత్రి తాడేపల్లి మండలం కొలను కొండ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అదే సమయంలో క్యాంపు కార్యాలయం నుంచి వెళ్తున్న చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రమాదాన్ని గమనించి కాన్వాయ్‌ను ఆపి గాయపడిన నలుగురు మహిళలను తన వ్యక్తిగత సిబ్బంది కారులో వైద్యం నిమిత్తం ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి తరలించారు. నలుగురికీ వైద్యం చేయించారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన ఆదిలక్ష్మి, నారాయణమ్మ, సరస్వతి, నారాయణమ్మలు కొలనుకొండలోని బహుళ అంతస్తుల్లో వంట, ఇంటి పనులు చేస్తున్నారు. వీరు తిరిగి విజయవాడ వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా బస్సు ఢీకొంది. వీరిలో నారాయణమ్మ పేర్లు కలిగిన ఇద్దరి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఎన్‌ఆర్‌ఐ వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు.

ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి

ఏపీఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు ఆవేదన


మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ విధానాలతో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడి అనుభవిస్తున్నారని ఏపీఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు అన్నారు. బుధవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో సుధీర్‌బాబు మాట్లాడుతూ విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం వల్ల హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయులకు టెస్ట్ నామినల్ రోల్స్ నిర్వహణ భారంగా మారిందని, మరోవైపు అపార్ నమోదు ప్రక్రియ తలనొప్పింగా మారిందని వివరించారు. సరైన రవాణా సౌకర్యాలు లేని కేంద్రాలలో శిక్షణ ఇవ్వడం వలన అక్కడికి చేరుకునేందుకు టీచర్లు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ 50 ఏళ్లకు పైబడిన ఉపాధ్యాయులకు, వికలాంగులకు, చిన్నపిల్లలు ఉన్న మహిళా టీచర్లకు శిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. నూజివీడు సమీపంలోని ఆగిరిపల్లిలో ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఉపాధ్యాయుడు మరణించడం బాధాకరమని అన్నారు. వేసవి సెలవుల్లోనే వృత్యంతర శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిమళ్ల ప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిలర్ కమతం శ్రీనివాసరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వై.శ్యాంబాబు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని జిల్లా పోలీస్ అథారిటీ చైర్మన్‌కు వినతి

భట్టిప్రోలు: పోలీసులు, టీడీపీ నాయకుల కక్ష సాధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, నాయకులు మోర్ల కోటేశ్వరరావు, గోలి శ్రీనివాసరావులు బుధవారం జిల్లా పోలీస్ అథారిటీ చైర్మన్ నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ నాయకులకు పోలీసులు కొమ్ము కాస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తమకు రక్షణ కల్పించాలని ఆయనను కోరారు.

సరస్వతీ భూములపై కూటమి నేతల రాద్ధాంతం

తీవ్రంగా ఖండించిన వైఎస్సార్ సీపీ అధ్యాపక విభాగం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సరస్వతీ భూములపై జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అవాస్తవాలను మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ అధ్యాపక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని పేర్కొన్నారు. సరస్వతీ భూములు కొనుగోలు చేసి 20 సంవత్సరాలకుపైగా గడిచాయని, ఉద్యోగాలు, ఉపాధి వస్తాయనుకున్న రైతులు, నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్న మాటల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఆ భూములు రైతుల నుంచి వారి ఇష్ట ప్రకారం వారు ఆశించిన ధర కంటే అధికంగా చెల్లించి కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రభుత్వ భూములను 40 ఏళ్ళ నాడు సాంఘీ, అంబుజా సిమెంట్స్, మై హోమ్స్ వంటి వారికి దోచిపెట్టిన గత ప్రభుత్వాల గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. వైఎస్ జగన్ కొనుగోలు చేసిన భూములపై ఉద్దేశపూర్వకంగానే నానా యాగీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌పై ఎన్ని నీలాపనిందలు మోపినా.. ప్రజలు నమ్మరన్నారు. అక్కడ ఫ్యాక్టరీ కట్టకుండా అడ్డుకుంది చంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాల, బైపాస్ రోడ్డు వంటి అభివృద్ధి కనపడని పవన్‌కళ్యాణ్ వైఎస్ జగన్‌పై ఉక్రోషంతో వ్యక్తిగత విమర్శలు చేస్తూ.. పర్యటనలు చేయటాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పటం తథ్యమని స్పష్టం చేశారు.

సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భట్టిప్రోలు: 2004 సెప్టెంబర్ తరువాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు మిస్సింగ్ క్రెడిట్ సమస్య ఎదుర్కొంటున్నారని ఏపీసీపీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ బుధవారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల ఉద్యోగుల జీతం నుంచి 10 శాతం నగదు కట్ చేస్తున్నారని, ప్రభుత్వ వాటా 10 శాతం జమ కావడం లేదని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు ఇటీవల ఏపీ వైద్య విధాన పరిషత్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా 010 పద్దు కింద జీతాలు తీసుకుంటున్నారని గుర్తుచేశారు. వీరికి సీపీఎస్ అమౌంట్ క్రెడిట్ కాకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే వారి ఖాతాల్లో సీపీఎస్ మిస్సింగ్ క్రెడిట్ అమౌంట్ జమ చేసి... సకాలంలో 10 శాతం వాటా కూడా విడుదల చేయాలని కోరారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు శిక్ష

చీరాల రూరల్: ఒక వ్యక్తిని హత్య చేసేందుకు యత్నించిన కేసులో ఆరుగురు నిందితులకు కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధిస్తూ చీరాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం. సుధ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2017లో చీరాల థామస్‌పేటకు చెందిన బొనిగల శ్యాంబాబు తన ద్విచక్ర వాహనంపై ముంతావారి సెంటర్‌కు వెళుతున్నారు. ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి శ్యాంబాబును అనుసరించారు. కాసేపటి తర్వాత ఇనుప రాడ్డుతో అతడి తలపై దాడి చేశారు. శ్యాంబాబు బండి సహా కిందపడిపోయాడు. దీంతో వెంట తెచ్చుకున్న కత్తులతో శ్యాంబాబుపై దాడి చేశారు. బాధితుడు పెద్దపెద్దగా కేకలు వేయడంతో పారిపోయారు. తర్వాత వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి సీఐ వి.సూర్యనారాయణ చార్జిషీటు దాఖలు చేశారు. బాధితుడి తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పద్మజా రెడ్డి తమ వాదనలు వినిపించారు.

ఈ నేపథ్యంలో నిందితుల్లో చీరాల జాన్‌పేటకు చెందిన జొన్నలగడ్డ ప్రభుదాసు అలియాస్ నాని, జొన్నలగడ్డ అశోక్‌కుమార్, ఉప్పు రమేష్, సాతినేని శివపార్వతిలకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. 2,000 వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుధ తీర్పు చెప్పారు. దేవిశెట్టి మస్తాన్‌రావు, అరతోటి ప్రసాద్‌లకు ఏడాది సాధారణ జైలు శిక్షతోపాటు చెరో రూ. వెయ్యి జరిమానా విధించారు. కేసు ఛేదించిన అప్పటి సీఐ సూర్య నారాయణ, ప్రస్తుత సీఐ ఎం. శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ ఎ. నీలకంఠారెడ్డి, పీపీ పద్మజా రెడ్డిని ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

మలేరియా అధికారి రవి రత్నాకర్


సేవల వివరాలు అడిగి తెలుసుకుంటున్న పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవిరత్నాకర్

రెంటచింతల: స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి వివిధ రకాల వ్యాధులతో వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలను అందించాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ల్యాబ్‌లో ప్రజలకు నిర్వహిస్తున్న పరీక్షల గురించి తెలుసుకుని రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం జ్వరాలు వచ్చే సీజన్ కాబట్టి ల్యాబ్ టెక్నీషియన్లు ఖచ్చితంగా నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి తగు సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో వస్తున్న జ్వరం కేసుల వివరాలను మెడికల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలు(ఓపి) నమోదు, ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు, రక్తపరీక్షల వివరాలు, మందులు ఇచ్చే విభాగం పనితీరు, వివిధ రికార్డులు పరిశీలించి తనిఖీ చేశారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ సీహెచ్ అంకమ్మరావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు హేమ, రమా, ఎంపీహెచ్‌ఈఓ ఎ.ఆంజనేయులు, సూపర్‌వైజర్లు ఎస్.కోటేశ్వరరావు, హెచ్‌వి లక్ష్మీప్రసన్న, హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరల పెంపుపై 8 నుంచి నిరసన కార్యక్రమాలు

సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్


పార్టీ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: దేశంలో ప్రజలపై భారం మోపటమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు రెవెన్యూ, కలెక్టరేట్ ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న సమస్య ధరలు అన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు ఏ చర్య తీసుకోకపోవటం శోచనీయంగా ఉందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు ఎక్కువగా ఉండటం వలన వాటి భారం నిత్యావసరాలపై పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలపై ట్రూఆప్ చార్జీలు వేస్తే బాదుడే బాదుడు అంటూ విమర్శించి తాము అధికారంలోకి వస్తే చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబునాయుడు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే అవే చార్జీలను ఇప్పుడు ప్రజలపై వేస్తున్నాడన్నారు. ఒకే ఎన్నిక, ఒకే దేశం అంటూ ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలుచేసేందుకు బీజేపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వరంగంలో ఉన్న ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయటంలో కూడా విఫలమయ్యారన్నారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటికి పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు సీపీఎం ప్రచారం నిర్వహిస్తుందన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు డి.శివకుమారి, శిలార్ మసూద్, కామినేని రామారావు, గుంటూరు మల్లీశ్వరి పాల్గొన్నారు.

డిసెంబర్ 15లోపు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం పూర్తి

కలెక్టర్ నాగలక్ష్మి


హాస్టల్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

గుంటూరు ఎడ్యుకేషన్: రూ.మూడు కోట్ల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ ఎస్సీ హాస్టల్ నిర్మాణాన్ని డిసెంబర్ 15లోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం బీఆర్ స్టేడియం ఎదుట నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆమె పరిశీలించారు. 90 సెంట్ల విస్తీర్ణంలో ఐదేళ్ల క్రితం రూ.మూడు కోట్ల అంచనాతో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు సంబంధించిన పనుల్లో బిల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి రూ.2.10 కోట్లు ఖర్చు చేసినట్లు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.అనిల్‌కుమార్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. భవన నిర్మాణ పనులు పూర్తికి మరో రూ.90 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ గ్రాంటుతో భవన నిర్మాణ పనులు పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వచ్చేనెల 15లోగా పనులు పూర్తిగా చేపట్టి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఏసీ కళాశాల ఎదుట ఉన్న పురాతన ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. ప్రాంతీయ గ్రంధాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి భవనం వున్న శిధిలావస్థ స్థితిని గమనించారు. గ్రంధాలయం పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఏపీఇడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. గ్రంధాలయంలో లైట్లు, ఫ్యాన్ల కొరత ఉందని పాఠకులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆయా వసతులను సమకూర్చుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట డివిజనల్ ఇంజినీర్ బీఏ రవీంద్ర, గుంటూరు తూర్పు తహశీల్దార్ నగేష్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిణి చెంచు లక్ష్మీ, గ్రంధాలయ అధికారులు పాల్గొన్నారు.

సెంచరీలతో హోరెత్తించిన ఆంధ్ర బ్యాటర్లు

తొలి రోజు 90 ఓవర్లలో 374 పరుగుల భారీ స్కోర్


యూరన్ (122 పరుగులు)


లక్ష్మీనారాయణ (113 పరుగులు)


బౌలర్ నౌనిలాల్ (3 వికెట్లు)

మంగళగిరి: నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం కూచ్ బెహరా ట్రోఫీ అండర్ –19 క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. తొలిరోజు జరిగిన ఆంధ్ర వర్సెస్ హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్‌లో ఆంధ్ర బ్యాటర్లు సెంచరీలతో హోరెత్తించారు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో ఆంధ్ర 4 వికెట్లు కోల్పోయి 374 పరుగుల భారీ స్కోరు సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు బ్యాట్స్‌మెన్‌లు ఎం.యూరన్, లోహిత్ లక్ష్మీనారాయణలు సెంచరీలతో చెలరేగిపోయారు. యూరన్ 117 బంతులలో 9 సిక్సులు, 5 ఫోర్లతో 122 రన్స్ సాధించగా లోహిత్ లక్ష్మీనారాయణ 166 బంతులలో 12 ఫోర్లు, 6 సిక్సలతో 113 రన్స్‌తో రాణించారు. హిమాచల్ ప్రదేశ్ బౌలర్ నౌనిలాల్ 3 వికెట్లు తీశాడు.

గంజాయి ముఠా అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అజీజ్

21 కిలోల గంజాయి స్వాధీనం

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): అక్రమంగా గంజాయి తరలించటంతో పాటు, విక్రయాలు చేస్తున్న ఆరుగురు యువకుల ముఠాను గుంటూరు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. లాలాపేట పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఏవీ శివప్రసాద్ వివరాలను మీడియాకు వెల్లడించారు. గుంటూరు నగరంలోని సంపత్‌నగర్ అప్పడాల కంపెనీ సమీపంలో నివాసం ఉండే కొత్తవారి సాయిచరణ్ అలియాస్ గణేష్, అదే ప్రాంతానికి చెందిన మద్దాల చక్రపాణి, షేక్ సలీం అలియాస్ హైదరాబాద్, గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామానికి చెందిన దండమూడి జగదీష్ అలియాస్ డీజే, చిన్నబజారు ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్‌రజాక్, కింగ్స్ హోటల్ పక్కన ఉండే షేక్ ఆరీఫ్ వ్యసనాలకు బానిసలుగా మారి వైజాగ్, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి గంజాయిని రూ. 2వేల చొప్పున తీసుకుని వస్తారు. ఇక్కడ కిలో రూ 20వేలకుపైగా అమ్మటంతో పాటు, పొట్లాలుగా చేసి విక్రయాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఏటుకూరు రోడ్డులోని డంపింగ్ యార్డు వద్దకు గంజాయి తీసుకుని వచ్చి, పంచుకుంటున్న క్రమంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితుల్లో కొత్తవారి సాయిచరణ్ అలియాస్ గణేష్, దశరథరామిరెడ్డి అలియాస్ అభి అనే వ్యక్తులు కలిసి కొంత కాలంగా సెల్‌ఫోన్‌లు, బైక్‌లు చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వివరించారు. వారిపై పలు స్టేషన్‌లో చోరీ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవటంలో ప్రతిభకనబరిచిన ఎస్సైలు ఆర్ఎం విజయ్‌కుమార్, షేక్ హసీమ్, కానిస్టేబుళ్ళు పి. కిరణ్, పి. శంకర్, యు. గోవిందరాజులు, ఆర్ ఆంజనేయులు, ఏ. మల్లికార్జునరావు, అప్పలనాయుడును అభినందించారు.